క్లుప్తంగా

తాగునీరు వృథా



ఏలేశ్వరంలో కుళాయి నుంచి వృథాగా పోతున్న తాగునీరు

ఏలేశ్వరం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో తారునీరు వృథాగా పోతోంది. నగర పంచాయతీ కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో తాగునీరు వృథా అవుతోంది. స్థానిక అంబేడ్కర్ నగర్‌లో కుళాయిలకు ట్యాప్ ఉండడం లేదు. మున్సిపల్ అధికారులు కుళాయిలకు ట్యాప్ వేసిన మరుసటిరోజే స్థానికులు వాటిని తొలగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం



జి.కొత్తపల్లి డ్రైన్‌లో పూడిక తీస్తున్న పంచాయతీ సిబ్బంది

శంఖవరం: ప్రభుత్వం పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది డ్రైనేజీల్లో పూడిక తీశారు. రోడ్లను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. మహిళలు తమ ఇళ్లలోని వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందజేయాలని సర్పంచ్ కోరారు.

రహదారిపై గుంత.. ప్రయాణికులకు చింత



ఎ.కొత్తపల్లి రోడ్డుపై ఉన్న గుంత

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లి సాలిపేట రామాలయం వద్ద సీతారాంపురం వెళ్లే రహదారిలో డ్రైన్‌పై నిర్మించిన సిమెంటు పలకలు దెబ్బతినడంతో రహదారి మధ్యలో గుంత ఏర్పడింది. ఈ రహదారిలో ట్రాక్టర్లు, భారీ వాహనాలతో పాటు ద్విచక్ర, ఇతర వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. సిమెంటు పలకలు దెబ్బతినడంతో ఏర్పడిన గొయ్యి రాత్రి సమయాల్లో కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కలిసిన ఎస్సై సతీష్



చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సై సతీష్

ఏలేశ్వరం: స్థానిక నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతిని ఆదివారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై జి.సతీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి పట్టణంలో సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో సమర్థంగా లా అండ్ ఆర్డర్ అమలు చేసేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. కౌన్సిలర్లు అలమండ చలమయ్య, యండగండి నాగబాబు, కోనాల వెంకటరమణ పాల్గొన్నారు.

మురుగు సమస్యకు మోక్షం



జేసీబీతో పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: స్థానిక చైతన్యనగర్‌కాలనీ డ్రైన్లు లేకపోవడంతో మురుగు నీరు ఇళ్లమధ్య నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలనీలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ నిర్వహించిన గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి కాలనీలో డ్రైన్ల ఏర్పాట్లుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్య ఆదివారం డ్రైన్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. పార్టీ నేతలు మసిరపు నాగేశ్వరరావు, తొండారపు రాంబాబు పాల్గొన్నారు.

కొలువుదీరిన క్రీడాకుసుమాలు

- క్రీడలకు పుట్టినిల్లు కిర్లంపూడి జెడ్పీ హైస్కూల్
- జాతీయ స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు
- స్పోర్ట్స్ కోటాలో 20 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగాలు



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో తలపడుతున్న కిర్లంపూడి క్రీడాకారులు

కిర్లంపూడి: స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో చదివిన ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ సాయిలో రాణిస్తున్నారు. పలువురు విద్యార్థుల స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. అనాది కాలం నుంచి కబడ్డీ క్రీడకు పెట్టింది పేరు కిర్లంపూడి ప్రభుత్వోన్నత పాఠశాల. ప్రస్తుతం కిర్లంపూడిలో రాజకీయంగా ప్రజలకు సేవలందిస్తున్న ఎంతో మంది నాడు ఈ పాఠశాల క్రీడా ప్రాంగణంలో కబడ్డీ ఆడినవారే. 1998లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఖోఖో సంఘం కార్యదర్శి కె.పట్టాభిరామ్ కిర్లంపూడి హైస్కూల్‌కు పీడీగా వచ్చారు. అప్పటి నుంచి కబడ్డీతో పాటు, ఖోఖోలో ఇక్కడ క్రీడాకారులు రాణిస్తున్నారు. ఆయన శిక్షణలో పలువురు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచడంతో పాటు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించి పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారు. స్పోర్ట్స్ కోటాలో రైల్వే, పోలీస్, ఇతర డిపార్ట్‌మెంట్‌ల్లో 20 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. మరికొందరు ప్రైవేట్ పాఠశాలల్లో పీడీలుగా పని చేస్తున్నారు.

ఉద్యోగం చేస్తూనే..



చదువుతో పాటు క్రీడలపై ఉన్న మక్కువతో జాబ్ చేస్తూనే పలు టోర్నీల్లో పాల్గొంటున్నాను. ఖోఖోలో ఆంధ్రప్రదేశ్ తరఫున సుమారు 25 పైగా జాతీయ స్థాయి, 40పైగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్నాను. 2010లో మహారాష్ట్రలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో బ్రాంజ్ మెడల్, 2011లో ఆల్ ఇండియా గోల్డ్ మెడల్ సాధించాను. అదే సంవత్సరంలో స్పోర్ట్స్ కోటాలో బిలాస్‌పూర్ సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో జాబ్ వచ్చింది. 2015లో కేరళలో జరిగిన జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్నాను. 2018లో భారతదేశం తరఫున అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడంతో పాటు జట్టు కెప్టెన్‌గా కూడా వ్యవహరించి బంగారు పతకం సాధించాను.

–కర్రి శ్రీనివాసరావు,
ఇండియాన్ రైల్వేస్ ఖోఖో టీమ్ కెప్టెన్,
బిలాస్‌పూర్

స్పోర్ట్స్ కోటాలో జాబ్



ఆంధ్రప్రదేశ్ తరఫున 15పైగా జాతీయ స్థాయి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున 50పైగా రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీల్లో పాల్గొన్నాను. 2007లో కరీంనగర్ జిల్లాలో జరిగిన అండర్–19 జాతీయ చాంపియన్ షిప్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించాను. 2008, 2009 సంవత్సరాల్లో ఆంధ్రా యూనివర్సిటీ తరఫున ఆడి ఉత్తమ క్రీడాకారుడు అవార్డు పొందాను. 2009లో స్పోర్ట్స్ కోటాలో సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చింది. 2019లో ఐపీకేఎల్ లీగ్‌లో ముంబాయికి ఆడాను.

–చేదులూరి మణికంఠ,
సివిల్ కానిస్టేబుల్

12 జాతీయ స్థాయి టోర్నీల్లో ఆడాను



కిర్లంపూడి కొక్కొండ రామశేషగిరి పంతులు పాఠశాలలో 8వ తరగతి నుంచి ఖోఖో ఆడుతున్నాను. ఇప్పటికీ 12 సార్లు జాతీయస్థాయి టోర్నీలు, ఒక ఆలిండియా టోర్నమెంట్స్‌లో పాల్గొన్నాను. జాతీయ స్థాయి టోర్నమెంట్స్‌లో 3 సిల్వర్ మెడల్స్, 2 బ్రాంజా మెడల్స్ సాధించాను. 2008లో స్పోర్ట్స్ కోటాలో పోలీస్ జాబ్ వచ్చింది. జాబ్ చేస్తూనే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొంటున్నాను.

–గంధం అప్పారావు,
సివిల్ పోలీస్, కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు

రైల్వేలో ఉద్యోగం వచ్చింది



చిన్నప్పటి నుంచి క్రీడలపై మక్కువ ఎక్కువ. కబడ్డీ క్రీడలో రాణించి స్పోర్ట్స్ కోటాలో రైల్వే ఉద్యోగం సాధించాను. ఆంధ్రప్రదేశ్ తరఫున సుమారు 15పైగా జాతీయ స్థాయి, 30పైగా జిల్లా స్థాయి కబడ్డీ టోర్నీల్లో ఆడాను. 2016లో జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో కాంస్య పతకం వచ్చింది. 2017లో సౌత్ జోన్ కబడ్డీ పోటీల్లో నా ప్రతిభను చూసి సౌత్ ఈస్టాన్ రైల్వేలో ఉద్యోగం ఇచ్చారు. 2018లో ఆలిండియా టోర్నమెంట్‌లో బంగారు పతకం సాధించాను. అదే సంవత్సరంలో జరిగిన జాతీయ బీచ్ కబడ్డీ పోటీల్లో గోల్డ్ మెడల్‌తో పాటు ఉత్తమ సహాయ క్రీడాకారిణి అవార్డు గెలిపొందాను. ప్రస్తుతం ఇండియన్ రైల్వే టీమ్‌కు ఆడుతున్నాను.

–కోడెల వరమాణిక్య దుర్గ, కబడ్డీ కీడ్రాకారిణి

చదువుకున్న పాఠశాలలోనే ఉద్యోగం



నేను చదువుకున్న పాఠశాలలోనే ఉద్యోగం చేయడం ఆనందంగా ఉంది. నేను ఆటలాడిన క్రీడా ప్రాంగాణంలోనే విద్యార్థులకు క్రీడలపై శిక్షణ ఇవ్వడం ఎంతో గర్వంగా ఉంది. ఖోఖో విభాగం నుంచి ఆంధ్రప్రదేశ్ తరఫున 30కి పైగా జాతీయస్థాయి, 40 పైగా రాష్ట్రస్థాయి టోర్నీల్లో ఆడాను. జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 2 సిల్వర్ మెడల్స్, ఒక బ్రాంజ్ మెండల్ దక్కించుకున్నాను. 2012లో నాకు పీఈటీగా జాబ్ వచ్చింది. ప్రస్తుతం కిర్లంపూడి కొక్కొండ రామశేషగిరి రావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో పీడీగా పని చేస్తున్నాను.

– ఉల్లూరి నాగ వెంకట సత్యవతి,
పీడీ, జెడ్పీ హైస్కూల్ కిర్లంపూడి

క్రీడలతో ఉన్నత శిఖరాలకు...



చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఇష్టం. కబడ్డీలో ఏపీ టీమ్ తరఫున 13పైగా జాతీయ స్థాయి, 40పైగా రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొన్నాను. 2010లో పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించాను. ఆలిండియా పోలీస్ బృందం తరఫున 10 సార్లు ఆడడంతో పాటు పోలీస్ టీమ్‌కు కోచ్‌గా కూడా వ్యవహరించాను. ఖోఖో పోటీల్లో రెండు సార్లు యూనివర్సిటీ తరఫున ఆడాను. ప్రస్తుతం వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాను.

–పాలిక మణికంఠ,
పీఎస్‌ఓ

ఉచిత గ్యాస్ కనెక్షన్లను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది కృష్ణస్వరూప్

తుని రూరల్: కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ సూచించారు. మండలంలోని కేఓ మల్లవరంలో ఆదివారం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత గ్యాస్ కనెక్షన్ల నమోదు కార్యక్రమాన్ని న్యాయవాది కృష్ణస్వరూప్ ప్రారంభించారు. మాల మహానాడు తుని నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఎం.సింహాచలం, యూత్ సభ్యులు గుద్దటి శివ, బందిల శ్రీను, దండా లోవరాజు, నాయకులు బొడపాటి సురేష్‌కుమార్, సూరిబాబు, గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ డీలర్ మూర్తి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కాంట్రాక్టు లెక్చరర్ల జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గం

తుని రూరల్: కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా పి.రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా డి.ప్రవీణ్ కుమార్ ఎన్నియ్యారు. తుని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం సంఘ రాష్ట్ర కమిటీ–475 అధ్యక్షుడు బీఎస్ఆర్‌శర్మ అధ్యక్షతన జిల్లా అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. జిల్లా కార్యదర్శిగా వి.అచ్చుతంబాబు, కోశాధికారిగా ఎస్.దుర్గాప్రసాద్, సభ్యులుగా కె.శోభన్ బాబు, పి.రామాంజనేయరావు, కె.చిన్నబ్బాయి, కె.రామం, క్రిష్టి జయశీల ఎన్నియ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ నాయకులు బీజే గాంధీ, ఆర్.విజయచౌరి, జి.దయాకర్, డి.మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చురుగ్గా విశ్రాంతి షెడ్డు నిర్మాణ పనులు



రత్నగిరిపై విశ్రాంతి షెడ్డు నిర్మాణ పనులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 30 వీఐపీ సత్రం వెనుక పార్కింగ్ స్థలంలో నిర్మిస్తున్న విశ్రాంతి షెడ్డు పనులు వేగంగా చురుగ్గా జరుగుతున్నాయి. షెడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా ఈ నెల 1 నుంచి ఈ రోడ్డు మీదుగా రాకపోకలు నిలిపివేశారు. శరవేగంగా జరగాల్సిన పనులు నత్తనడకన సాగడంతో భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఈ నెల 24న 'పనులు మెల్లగా...అవస్థలు ఫుల్‌గా..' అనే శీర్షికతో 'సాక్షి' ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. షెడ్డు పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఈఓ సత్యనారాయణ మూర్తి అదేశించారు. దీంతో పనులు వేగవంతం చేశారు. వచ్చే నెల 1న భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా సుమారు లక్ష మంది భక్తులు సత్యదేవుని ఆలయానికి వచ్చే అవకాశం ఉంది. ఈ లోపు రోడ్డుపై రాళ్లు తొలగించి పూర్తి స్థాయిలో భక్తులు రాకపోకలు సాగించేందుకు వీలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తామని అధికారులు తెలిపారు. ఈఓ సత్యనారాయణ మూర్తి ప్రతిరోజూ పనులను పర్యవేక్షిస్తున్నారు.

నేడు భూసేకరణ సర్వే

తొండంగి: భారత్‌మాల ప్రాజెక్టులో భాగంగా మండలంలోని ఎ.కొత్తపల్లిలో సోమవారం భూసేకరణకు సర్వే నిర్వహించనున్నట్టు మండల సర్వేయర్ సీహెచ్ నిరంజన్‌రావు ఆదివారం తెలిపారు. అన్నవరం నమూనా టెంపుల్ వద్ద నుంచి తొండంగి, యు.కొత్తపల్లి మండలాల్లో పలు గ్రామాల మీదుగా నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి ప్రభుత్వం భూసేకరణ చేసింది. ఈ ఆయా సర్వే నంబర్లకు సంబంధించి ఎ.కొత్తపల్లిలో క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి ఎంత మేర భూ సేకరణ జరుగుతుందో నిర్ధారణ చేస్తామన్నారు. సర్వేలో వ్యవసాయబోర్లు, వృక్షాలు వంటి ఉంటే నమోదు చేసి ప్రభుత్వం నుంచి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు క్షేత్రస్థాయిలో సరిహద్దులు, వివరాలను తెలపాలని కోరారు.

పెద్దిపాలెంలో 'పొలంబడి'



పెద్దిపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రత్తిపాడు రూరల్: రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని అధిక దిగుబడులు సాధించాలని ఫెర్టిలైజర్స్ సహాయ వ్యవసాయ సంచాలకులు కేజీడీ రాజన్ అజన్ సూచించారు. మండలంలోని పెద్దిపాలెంలో ఆదివారం వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని రైతులు పెంపొందించుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన పంటలను అధిక ధర లభిస్తుందన్నారు. ప్రస్తుతం రైతులు ప్రకృతి సాగుపై ఆసక్తి చూపిస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ మాధవి, మండల వ్యవసాయ అధికారి వై.గంగాధర్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

తుని రూరల్: బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఫిబ్రవరి 15 నుంచి 20 వరకు జరిగే సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ 11వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.జనార్దన్ పిలుపునిచ్చారు. తునిలో ఆదివారం ఆ పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఫాసిజాన్ని ఓడించాలి, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి అనే నినాదంతో లక్షమందితో ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మహా సభల్లో భాగంగా ఫిబ్రవరి 15న సేవ్ డెమోక్రసీ, సేవ్ ఇండియా ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ సభల్లో పార్టీ కార్యకర్తలు, అభిమానుల పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యర్రంశెట్టి అప్పారావు, గంటిపల్లి సింహాచలం, ఉరుకుట్టు ఆనంద్, గొలగాని శ్రీను, చిడిపల్లి అప్పలనర్స, మూడు మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా అపరాల సాగు



ఎస్.అన్నవరంలో ఆశాజనకంగా ఉన్న పెసర పంట

తుని రూరల్: నియోజకవర్గంలో అపరాల పంటల సాగు ఆశాజనకంగా ఉంది. ఖరీఫ్ వరికోతలు పూర్తి చేసిన రైతులకు వ్యవసాయశాఖ రాయితీపై పెసర, మినుము విత్తనాలను సరఫరా చేసింది. దీంతో తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో పెసర 7,918 ఎకరాలు, మినుము 6,663 ఎకరాల్లో వేశారు. అక్కడక్కడ పల్లాకు తెగులు కనిపిస్తున్నప్పటికీ పంటలు బాగున్నాయని రైతులు తెలిపారు. అపరాలు సాగుతో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు తెలిపారు. ఫిబ్రవరి రెండో వారం నుంచి పంట ఫలసాయం రైతులకు అందుతుందని చెప్పారు.

విద్యార్థులకు చెకుముకి పోటీలు

జగ్గంపేట: స్థానిక వివేకనంద విద్యాసంస్థల్లో ఆదివారం జిల్లాస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు కాదా వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు మార్కుల కోసం బట్టీ పట్టీ పద్ధతిని వీడాలన్నారు. పాఠ్యాంశాలపై పట్టు సాధించి ప్రశ్నలకు జవాబులను విశ్లేషించే స్థాయిలో ఉండాలన్నారు. దీనికి అనుగుణంగా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వివేకనంద విద్యాసంస్థల అధినేత, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, జేవీవీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామారావు, మండల కార్యదర్శి బి.కోటేశ్వరరావు, సైన్స్ అండ్ టెక్నాలజీ కన్వీనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



చెకుముకి పోటీల విజేతలకు బహుమతులు అందజేసిన అతిథులు

అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి

గోకవరం: మండలంలోని అష్టలక్ష్మి ఆలయం సమీపంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కోరారు. అష్టలక్ష్మి గుడి సమీపంలో జరుగుతున్న మైనింగ్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కొండను ఆనుకుని సుమారు 12 వేల మంది ప్రజలు జీవిస్తున్నారన్నారు. మైనింగ్ వల్ల వీరు తీవ్ర అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, అలాగే ప్రమాదాలు జరిగే అవకాశాలు సైతం ఉన్నాయన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని మైనింగ్‌ని నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వి.కొండలరావు, కె.జ్యోతిరాజు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లలు లేని సేవలు లయన్స్‌క్లబ్‌కే సొంతం



ప్రత్తిపాడులో దివ్యాంగులకు నిత్యావసరాలు అందజేస్తున్న లయన్స్ జిల్లా గవర్నర్ ఉషారాజు

ప్రత్తిపాడు: ఎల్లలు లేని సేవలు లయన్స్‌క్లబ్‌కే సొంతమని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ ఉషారాజు అన్నారు. ప్రత్తిపాడులో లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ ఉషారాజు ఆదివారం అధికారిక పర్యటన నిర్వహించారు. స్థానిక లయన్స్‌క్లబ్ చేపట్టిన పలు సేవా కార్యక్రమాలను పరిశీలించారు. లయన్స్ కమ్యూనిటీ హాలు వద్ద వృద్ధులకు చీరలు, వికలాంగులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. స్థానిక సిరి మానసిక వికలాంగుల పాఠశాలలో విద్యార్థులకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు లయన్స్‌క్లబ్ సభ్యులు చేస్తున్న సేవలు అభినందించారు. క్లబ్ కార్యకలాపాలతో పాటు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని క్లబ్ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ సెక్రటరీ ఉప్పలపాటి జానకీదేవి, రీజినల్ చైర్‌పర్సన్ కె.సత్యనారాయణ రాజు, లయన్స్ అధ్యక్షకార్యదర్శులు గుడాల వెంకటరత్నం, తాతా సాంబు, మినర్వా స్కూల్ అధినేత డీవీఎస్ రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కిర్లంపూడి: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో ఆదివారం ఎంపీపీ తోట రవి అధ్యక్షతన పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని 836 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి పక్కన నిర్మిస్తున్న నూతన పోలీస్ స్టేషన్ పనులను ఆయన పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో త్వరిగ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సిబ్బందికి ఎమ్మెల్యే చంటిబాబు ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో తోట గాంధీ, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ, కిర్లంపూడి ఎస్సై టి.రఘునాథరావు, ఎంఈఓ టి.జోసెఫ్, ఎంపీడీఓ బి.ప్రసాద్‌బాబు, మండల సచివాలయాల కన్వీనర్ పెనగంటి రాజేష్, ఏఎంసీ డైరెక్టర్ దాడి అప్పలరాజు, పాము సూరిబాబు, యల్లపు శివ, ఇసరపు సూరిబాబు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



కిర్లంపూడిలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

యువతి అదృశ్యం

తుని రూరల్: తుని బ్యాంకు కాలనీకి చెందిన యువతి కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై ఎస్.గోపాలకృష్ణ తెలిపారు. ఆదివారం యువతి సోదరుడు సీహెచ్ ఈశ్వర మణికంఠ ఫిర్యాదు చేశాడన్నారు. ఈ నెల 22న వస్త్రాల దుకాణానికి వెళ్లి తిరిగి రాలేదని, అప్పటి నుంచి బంధువుల ఇళ్లలో వాకాబు చేసినా ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్సై వివరించారు.

సత్యసాయి సేవాసమితి వార్షికోత్సవం

ప్రత్తిపాడు: స్థానిక సత్యసాయి సేవా కేంద్ర భవనంలో ఆదివారం సేవా సమితి 16వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. శ్రీసత్యసాయి సేవా సమితి సబ్ డివిజన్ కన్వీనర్ కొమ్ముల జయబాబు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. పతాకావిష్కరణ అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు జంధ్యం సుబ్బారావు వేద పఠనం గావించారు. శ్రీసత్యసాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఉయ్యాలోత్సవం వైభవోపేతంగా జరిగింది. కార్యక్రమంలో యూత్ సేవా దళ్ సభ్యులు ఎం.లక్ష్మణ్ కుమార్, స్వాతి, ప్రవల్లిక, గోగుల విమలావతి, సీనియర్ న్యాయవాది కొల్లా వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.